

# విముక్తికోసం...

సి. హెచ్. పాపారావు

మొగుడంటే ఎట్లా ఉండాలి?

పులిలా ఉండాలి, పెళ్ళాన్ని చెప్పు కింద తేలులా ఉంచాలి. వీలయినంత ఎక్కువగా పెళ్ళాన్ని తిట్టాలి. వారానికి మూడు సార్లయినా కొట్టాలి. పాద పూజ చేయించుకోవాలి. పొరుగువాళ్ళతో మాట్లాడితే పోట్లాడాలి. ఇంకా ఇంకా చాలాచాలా చేయాలి.

పెళ్ళామంటే ఎట్లా ఉండాలి?

“పతియే ప్రత్యక్ష దైవము”అని రోజూ పాడుకోవాలి. మొగుడి పాదాలకు పూజ చేయాలి. కొట్టినా, తిట్టినా, తన్ని తగలేసినా—“మీరే నాకు దిక్కు, మీ పాదసేవే నాకు మాహాభాగ్య” మని ముద్దురాచ్చిన్న మాటలు మాత్రమే మాట్లాడాలి. పతివ్రతల కథలు మాత్రమే చదవాలి. చలంలాటి వాళ్ళు స్త్రీ జాతికి బద్ధ శత్రువులని చాటి చెప్పాలి. మొగుడిని మాత్రమే తలెత్తి చూడాలి. మరో మగాడ్ని చూస్తే వంద జన్మలదాకా వదలని మహాపాపం చేసినట్లు భయ పడాలి. అసలు ఇన్ని మాటలు కాకుండా ఒక్క మాటలో చెప్పాలంటే ఇంట్లో కట్టి పడేసిన కుక్కలా ఉండాలి.

—ఇలాంటి అభిప్రాయాలున్న వ్యక్తితో కాపురం చేస్తోందామె. ఆమెకది సంసారమనిపించదు. భర్త సమక్షంలో ఉన్నంతసేపు తనోపులి బోనులో నిలబడ్డట్లు, దావానలం మధ్యకు విసిరేసి నట్లు, వరదలొస్తున్న నది వడ్డున నిలబడ్డట్లు ఉంటుంది. ప్రతిక్షణం అతను పెట్టే హింసలు, అవమానాలు భరిస్తూ రాని చావును తలుచు కుంటూ కాలక్షేపం చేస్తుంది.

అతనితో ఆమెకు వివాహమయి ఒకటిన్నర సం. అయ్యింది. ఆ కొద్ది కాలంలోనే ఎన్నో చిత్ర హింసలకు, అవమానాలకు గురయ్యింది. ఆమెకతన్ని వివాహం చేసుకోవటం ఇష్టంలేదు. కాని ఆమె ఆర్థిక పరిస్థితులలాంటివి.

ఆమె తండ్రికి నల్గురాడపిల్లలు. ముగ్గురికి పెళ్ళయ్యేసరికి అతని ఆస్తి, ఆయుస్సుకూడా చాలా వరకూ హరించుకు పోయినయి. తను చివరది. పెళ్ళి ఎలాను జరిగేట్లులేదు కదా! అని తను డిగ్రీ పూర్తి చేసింది. ఉద్యోగమేదయినా దొరుకు తుందేమోనన్న ఆశతో. ఉద్యోగం కావాలంటే ఆడవాళ్ళకు కావల్సిన ప్రత్యేక అర్హత అందమని ఆమెకు తరువాతగాని తెలిసి రాలేదు. ఇరవై ఆరేళ్ళు వచ్చినా పెళ్ళి చేయలేదన్న సంఘంపోరు, తను తన తండ్రికి బరువయ్యా నన్న ఆవేదన, ఇలాంటి స్థితిలో అతని సంబంధం వచ్చింది

అతను ఎమ్మెస్సీచేసి ఓ పెద్ద ప్రైవేట్ కంపెనీలో కెమిస్టుగా చేస్తున్నాడు. మనిషి అందంగానే ఉంటాడు. పదివేలు కట్నం చాల న్నాడు. తను అందంగా లేక పోయినా నచ్చా నన్నాడు. అతని మొదటి భార్య చచ్చిపోయింది. కాని కొందరు మాత్రం అతనే చంపేశాడం టారు. ఆ మాట విని తను భయ పడ్డది. తల్లి తండ్రులు మాత్రం ఆ విషయం పట్టించు కోలేదు. వాళ్ళకు కావల్సింది తక్కువ ఖర్చుతో తనను వదిలించుకోవటం. అంత తక్కువ ధరకు అల్లుడు దొరకటంతో వాళ్ళు చాలా సంతోషించి ఉన్న ఇల్లు అమ్మేసి పెళ్ళి అయ్యిం దనిపించారు. తను అయిష్టంగానే అంగీక రించింది.

ఆ తర్వాత పెళ్ళయిన వారం రోజులకే తనకు పెళ్ళయినట్లనిపించలేదు. ఏదో నరకం లోకి మెడపెట్టి త్రోసినట్లనిపించింది. అత నామెను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు పెట్టేవాడు. తల్లి తండ్రులకు చెప్పు కున్నా వాళ్ళు విననట్లు ఊరుకునే వారు. అసభ్యంగా, అశ్లీలమయిన మాటలతో తిట్టేవాడు, పక్క ఇళ్ళ వాళ్ళతో మాట్లాడితే కొట్టేవాడు. కాఫీలో పంచదార తగ్గినా, కూరల్లో ఉప్పుకారం తగ్గినా దగ్గరకు పిలిచి ముఖాన విసిరేసే వాడు.పత్రికల్లో వికృతంగా ఉన్న బొమ్మల్ని చూపించి ఇదిగో ఈ బొమ్మ నువ్వేకదా! అనేవాడు. ఇక రాత్రులు అతను పెట్టే హింసలు బహుశ పూర్వం ద్రోహులను శిక్షించేందుకు కూడా ఉపయోగించేవారు కాదు. అంత క్రూరంగా ప్రవర్తించేవాడు.

అతనేప్పుడో మూడ్నెల్లకొకసారి కాంపు కెళుతుంటాడు. ఆ సమయమే ఆమెకు ఆటవిడుపు. ఆ సమయంలో కూర్చుని మవునంగా రోదించేది. ఆ స్వేచ్ఛను ఆమె మనస్సుతీరా ఏడ్వేందుకుపయోగించేది. అతనున్నప్పుడు ఆమెకు ఆ స్వేచ్ఛకూడా ఉండేది కాదు.

* * *

ఆ రోజు ఉదయమే కాంపుకెళ్ళాడు తను వారందాకా తిరిగి రానంటూ. అతను ఎప్పుడు వచ్చేది ఎప్పుడూ నిజం చెప్పడు. నాల్గురోజు లయితే వారం రోజులని చెప్తాడు. ఆమె ఏం చేస్తుందో ముందుగా వచ్చి తెల్సుకో వచ్చని ఆశ. ఆమె మీద అనుమానం. ఆరోజు అలానే చెప్పి వెళ్ళాడు.

ఆమె అతను వెళ్ళాక ఇల్లంతా సర్దుతూంటే అప్పుడు కన్పించిందామెకతని డైరీ. అతను మర్చిపోయి వెళ్ళినట్లున్నాడు. అతను డయరీ వ్రాయటం తనెప్పుడూ చూడలేదు. అతని వస్తువులన్నీ భద్రంగా తన పెట్టెలో పెట్టుకొని తాళం వేసుకొని వెళుతుంటాడు. వ్రాసి బయట పెట్టి మర్చి పోయి వెళ్ళినట్లున్నాడు. డైరీ ఎర్రటి కవరు లో నెత్తురులో ముంచి తీసినట్లుంది. ఆ డైరీ చూసి ఆమె ఆశ్చర్య పోయింది. ఆమె డైరీని చేతిలోకి తీసుకుంది. చేతులు వణుకుతున్నాయామెకు. చదువుదామనిపిస్తుంది. చదవటం సభ్యతకాదని తెలుసు. అతనికి తెలిస్తే చంపేస్తాడేమోనని భయం. చదవమని మనస్సు బలవంతం చేస్తుంది. ఎదుట వారి జీవన రహస్యాలను తెల్సుకోవటం కొందరకు సరదా. అదసలుమనిషిలోని బలహీనత. ఆ బలహీనతకు లొంగిపోయి ఆమెపేజీలు తిప్పింది. తెల్లటి పేజీలపై నల్లటి అక్షరాలు. కళ్ళు వేగంగా కదులుతున్నాయి.

జనవరి 10 1979

క్రొత్త సంవత్సరం ప్రారంభమయి పదిరోజులయినా డైరీ ఏం వ్రాయలేదు. లైఫ్ ఇన్సూరెన్సు ప్రిమియమ్ కట్టాల్సి ఉన్నది. నా పేరుమీద అనవసరంగా ఏభయివేలు కట్టాను. దాని పేరు మీద కట్టవలసినది. చచ్చింది కనుక ఏభయివేలు వచ్చుండేవి. దీనిపేరు మీదయినా త్వరలో పాలసీ తీసుకోవాలి.

జనవరి 24 1979

టైపిస్టు పంకజం నావలలో చిక్కుకుంది. పర్వాలేదు. నాల్గయిదుసార్లు హోటల్‌కు తీస్కెళ్ళి ఆపైన నేరుగా లాడ్జికి తీసుకెళ్ళ వచ్చు.

జనవరి 31 1979

పంకజం దారిలో పడింది.

దానిపేరు మీద పాలసీ కట్టాను. ముందుగా సంతకాలు పెట్టటాన్కి అనుమానించింది. యార్క్‌షైర్ రిప్పర్ గురించి ఓ మాగజైన్‌లో పడింది. చాలా త్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్సు. దానిమీదచేసి చూడాలి. దాన్లో ఓ మంచి గుణం ఉంది. ఏంచేసినా గొంతెత్తి ఏడవదు. ఆ మొదటిది ఊరంతా వినిపించేట్టు ఏడిచేది. దీనిలాగా ఉంటే ఇంకొంత కాలం బ్రతికుండేది కదా! పిచ్చిది.

ఫిబ్రవరి 11 1979

పంకజంతో హోటల్ కెళ్ళాను. కాళ్ళు చేతులు తగిలిస్తుంటే ఏమనలేదు.

ఈ మధ్య ఆరోగ్యంలో మార్పు వచ్చింది. మొన్న కాంపు కెళ్ళినప్పుడు గుండె నొప్పి వచ్చింది. డాక్టర్ ఈసారికి పర్వాలే దన్నాడు. మరోసారి రాకుండా జాగ్రత్త పడమన్నాడు. ఎప్పుడూ టాబ్లెట్లు దగ్గర పెట్టుకోమన్నాడు. ఈ డాక్టర్లను నమ్మ కూడదు. మనదగ్గర డబ్బు గుంజటాన్కి ఏవేవో కబుర్లు చెబుతుంటారు. ఎందుక యినా మంచిదని టాబ్లెట్లు దగ్గరంచుకున్నాను దానికీ విషయం చెప్పలేదు. చెబితే ఏడుస్తుందా? ఆనందిస్తుందా?

ఫిబ్రవరి 28 1979

ఇవ్వాళ ఒకతన్ని కల్సాను. అతనింట్లో రకరకాల పక్షుల, జంతువుల చర్మాలతో చేసిన బొమ్మలు. నాముందే ఒక ఉడతను చంపి దాని చర్మం కోసి లోపల ఉన్నదంతా తీసి గడ్డి కూరిమళ్ళీ ఉడతలా కుట్టేసాడు. భలే అద్భుతమైన హాబీ. నేను ఆ హాబీ ప్రాక్టీస్ చేస్తాను.

మార్చి 15 1979

దానికి నెల తప్పిందట. ఛీ! పిల్లలెందుకు మన సుఖాన్ని కాజేసే రాక్షసులు. వెంటనే గర్భ విచ్ఛిత్తికి టాబ్లెట్లు తెచ్చిచ్చాను. వేసుకో నంది. బలవంతంగా నోరు పెగలతీసి ఓ అరడజను వేసేసాను.

మార్చి 24 1979

పంకజం మరీ పతివ్రతలా ప్రవర్తిస్తుంది. దగ్గరకు రానివ్వటల్లేదు. పెళ్ళి చేసుకోమం టుంది. నాకొకసారి పెళ్ళయినట్లు తెలియదు. పిచ్చిది.

మార్చి 31 1979

పంకజాన్ని వదులుకోలేను. అది నాక్కావాలి. అది కావాలంటే దీన్ని వదులు కోవాలి. ఇది త్వరగా వదిలేట్లు లేదు. ఎంత తిట్టినా, తన్నినా పోటల్లేదు. మొద్దుమొహం. ఎంత కాలం ఇంకా దీంతో....

ఏప్రిల్ 10 1979

పంకజం తొందర చేస్తుంది. పెళ్ళి విషయం త్వరలో నిర్ణయించేయాలి. దీన్ని వదిలించు కోవటం ఎలా?

బయటకు తరిమేస్తే కోర్టుకెక్కుతుంది. దానికి బోలెడంత ఖర్చు. శ్రమ. అందులో ఇన్సూరెన్సుకూడా కట్టాడు. అదొక వృథా.

ఒకటే మార్గం....అటు డబ్బూ వస్తుంది శ్రమ, ఖర్చు తగ్గుతాయి. చేతికి బురద కాకుండా పనిపూర్తి చేయచ్చు. దాన్ని వదిలించుకున్నట్లే వదిలించుకోవాలి.

అట్లా చేయాలంటే ఇంకొంత కాల మాగాలి.

—ఆ తర్వాత పేజీలు ఖాళీగా ఉన్నాయి. అవి చదివిన ఆమె మనస్సు భయంతో మొద్దుబారిపోయింది. భయంతో శరీరం కంపించిపోయింది. తనెవరో ఇప్పుడే గొంతు పిసికి చంపేస్తున్నట్లుంది. తననతడు చంపేస్తాడు. గొంతు పిసికి చంపేసి ఉరేసు కుందంటాడేమో, కిరసనాయిలు పోసి అంటించి స్టవ్ అంటిస్తుంటే చీరంటుకొని చచ్చి పోయిందంటాడేమో, బావిలోకి త్రోసి కాలు జారిపడిపోయింతంటాడేమో...ఎవ్వరూ అనుమానించరు. పోలీసులు కేసు సునాయాసంగా తేలి పోయినందుకు సంతోషిస్తారు. ఇలా ఎందరో బలయిపోతున్నారు... తనూ బలయిపోతుంది..

ఏంచేయాలి? తను చావునుంచి రక్షించబడాలంటే ఏంచేయాలి? అతన్నుంచి పారిపోవాలి. ఎలా? పారిపోయి ఎలా బ్రతకాలి?

**...ఆ తర్వాత పేజీలు ఖాళీగావున్నాయ్. అవి చదివిన ఆమె మనసు భయంతో మొద్దుబారి పోయింది. శరీరం కంపిలచింది. తనవెవరో ఇప్పుడే గొంతు పిసికి చంపేస్తున్నట్లుంది. తననతడు చంపేస్తాడు.**

తల్లితండ్రులు భర్తనొదిలేసొస్తే రానివ్వరు. చుట్టూ ఉన్న మనుషులు వంటరిగా స్త్రీని బ్రతకనివ్వరు.

మరి ఎలా?

ముందుగా ఇక్కడ్నుంచి పారిపోతే చాలు.. ఆ తర్వాత ఎలాగయినా బ్రతకచ్చు. ఎక్కడి కెళ్ళాలి...

హైదరాబాదులో తన స్నేహితురాలుంది. ముందుగా కొద్దిరోజులు దాని దగ్గరకెళితే అక్కడ దాని ద్వారా ఏదయినా ఉద్యోగం సంపాదించుకోవచ్చు. అదక్కడ ఉందో లేదో ముందు కనుక్కోని తన పరిస్థితి ఉత్తరంలో వ్రాయాలి. దాని నుంచి జవాబు వచ్చే దాకా ఈ నరకం తప్పదు. అతను తనను వెంటనే చంపడు కనుక కొద్ది రోజులు ఆలస్య మయినా పర్వాలేదు.

కాని అతనికి తను డైరీ చదివినట్లు అనుమానం రాకూడదు. వచ్చిందంటే ఒక్క నిమిషం కూడా బ్రతకనివ్వడు. ఆ డైరీని యథాస్థానంలో ఉంచేసి తను చూడలేదన్నా నమ్మడు. అసలు డైరీ కంట పడకుండా చేసేసి ఆ డైరీ తను చూడలేదనాలి... అందుకని ఆ డైరీ కాల్చేస్తే... కాల్చేస్తే ఎవ్వరికీ అనుమానం రాదు. హైదరాబాద్ నుంచి తన స్నేహితురాలు ఉత్తరం వ్రాయకముందు చంపేస్తే...? తను దిక్కులేని చావు చస్తుంది. అతను మరో స్త్రీని పెళ్ళి చేసుకుంటాడు... మరో అమాయకురాలు బలవుతుంది... అలా జరగకుండా ఉండాలంటే... తనుపోయినా మరొకరు బలి కాకుండా ఉండాలంటే....' డైరీని కూడా హైదరాబాద్ పంపేస్తే తన చావుకు సాక్షిలా ఉపయోగపడుతుంది. అతని బ్రతుకునది రచ్చకీడుస్తుంది.

అదే మంచిది.

ఆ నిర్ణయం తీసుకున్న ఆమె ఆ రోజేతన ఉత్తరంతో పాటు డైరీ కూడా పోస్టు చేసింది.

* * *

వారంరోజులకు వస్తానన్నతను ఆ మరుసటి రోజే వచ్చాడు. అతనంత త్వరగా రావటం ఆమెను కొంచెం ఆశ్చర్య పరిచింది. అతని కోసమామె వంట చేయలేదు. ఆమెకోసం వండుకున్నదంతా తినేసి 'ఏమీలేదానీకు' అని వెకిలిగా నవ్వాడు. ఆమె మవునంగా ఊరుకుంది. ఆ రాత్రి మంచినీళ్ళు ఆమె ఆకలిని తీర్చినయి.

ఆ మరుసటి రోజు ఆదివారం.

అతను ఏ క్షణం డైరీ కోసం వెతుకుతాడోనన్న భయం తను తియ్యలేదంటే అతను నమ్మడు. అతను నమ్మకపోతే ఆ రోజే తనకు మృత్యువు తప్పదు.

ఆమె శరీరంలో రక్తంతోపాటు భయం కూడా ప్రవహిస్తుంది. ఆమె ఇంటి పని చేసుకుంటూనే అతని కదలికలన్నీ భయంగా గమనిస్తుంది.

ఇల్లంతా నిశ్శబ్దం. తుఫాను ముందటి ప్రశాంతత... ఆ నిశ్శబ్దపు తెరను చీల్చుకుంటూ వచ్చిందతని అరుపు... 'ఏమే పంది నా డైరీ ఎక్కడ?' అసహనంగా అరిచాడు ... ఆమె శరీరం కంపించిపోయింది. తుఫాను గాలికి దడిసిన మొగ్గలా...

ఆమె భయంగా అతని గదిలోకి ప్రవేశించింది. అతను అసహనంగా, చిరాకుగా, కోపంగా... మళ్ళీ అరిచాడు.


''ఏమే పాపిష్టి... ఎక్కడ నాడైరీ''

''నాకు తెలియదండి...నే చూడలేదండీ'' భయం, వణుకు, తడబాటు కలగాపులగంగా ఆమె గొంతు, ఆమెలోని తడబాటు, వణుకు అతనిలో అనుమానానికి బలం పోసినయి.

''అబద్ధం..నువ్వు తీశావు'' అరిచి రాక్షసంగా ఆమె మీదపడి జుట్టందుకొని కొట్టటం ప్రారంభించాడు. ఆమె అతని నుంచి తప్పించుకొనేందుకు పెనుకులాడుతోంది. ఆమె పెనుగులాట అతనిలో కసిని రెచ్చకొడు తుంది. శరీరంలోని నెత్తురంతా ముఖంలోకి తోసుకొచ్చినట్లు ఎర్రబారింది. అతని ముఖంకసితో,

ఆమె బలహీనంగా ఎదురు తిరుగుతోంది. ఆమెది ఓపికలేని తిరుగుబాటు.

''ఇవ్వాళ నిన్ను చంపేస్తాను... నిన్ను బ్రతకనివ్వను'' కసిగా అరుస్తూ ఆమె తల గోడకేసి కొడుతున్నాడు. తలనుంచి ఎర్రటి రక్తంకారుతుంది. ఈసమాజాన్ని... వెక్కిరిస్తున్నట్లు... వివాహ క్రతువును వెక్కిరిస్తున్నట్లు.. గాలిలో మిగిలిన వేదమంత్రాలు ''నాతిచరామి, నాతిచరామి''... దిగులుగా ఏడుస్తున్నాయి... ఆ గదిలోని గాలికూడ స్తంభించిపోయింది శపిస్తున్నట్లు...ఈ దారుణకృత్యం సహించ నంటూ...




ఆ రక్తంచూసి అతనిలోని రాక్షసుడు విజృంభించాడు... శరీరమంతా కసితో కదిపోయింది... తన రహస్యాలు తెలిసి పోయాయన్న భయం... రక్తం కొన్ని వందల మైళ్ళవేగంతో ప్రవహిస్తున్నట్లుంది...

వళ్ళంతా చెమట...

గుండె వేగం పెరిగింది

మరోసారి బలంగా ఆమె తల గోడకేసి కొట్టబోతున్న క్షణంలో...

అతని చేతుల్లోంచి ఆమె తల జారి పోయింది.

కళ్ళు తిరుగుతున్నట్లుంది...

విపరీతమయిన చెమట... వణుకు... గుండెల్లో సన్నటి నెప్పి...

గుండెను చేత్తో పట్టుకొని అతను వెనక్కు కదిలాడు. క్షణక్షణానికి నెప్పి ఎక్కువవుతోంది... శరీరమంతా వణికిపోతుంది. తల తిరిగి పోతున్నది. భూమి కంపిస్తున్న అనుభూతి...

కంగారుగా... అల్మారా దగ్గరకెళ్ళి రెండు టాబ్లెట్లు తీసుకొని మింగాడు. మంచం మీద ప్రశాంతంగా కూర్చొనే ప్రయత్నం చేస్తున్నాడు... మనస్సును ప్రశాంతత పరచే ప్రయత్నం చేస్తున్నప్పటికీ... ఎదురుగా కన్పిస్తున్న ఆమెను చూస్తుంటే అతనిలో కసిపెరిగి పోతూ ప్రశాంతతను దూరం చేస్తుంది...

ఆమె అతని వైపు వింతగా చూస్తుంది... డైరీలో అతను వ్రాసుకున్నది గుర్తొచ్చింది... అతనికి గుండె నెప్పి వచ్చింది. ఆమెలో ఎలాంటి ఆదుర్దాకలగలేదు... ఆమెలో భార్యలో కన్పించవలసిన సహజమయిన బాధ కన్పించలేదన్న కోపం అతనిలో కసిని పెంచుతోంది... ఆమెను మళ్ళీ కొట్టబోయే ప్రయత్నంలో అతను ముందుకు కదిలాడు...

....ఒక్కడుగు ముందుకేసి... ఎవరో శపించినట్లు... గుండెని పట్టుకొని... నేల మీద కొరిగాడు... అంత బాధలోను అహంకారం, క్రోధం వెల్లుకొచ్చేకంఠంతో ''వెళ్ళవే లంజ! వెళ్ళు... వెళ్ళి డాక్టర్‌ను పిలువ్'' కసిగా అరిచాడు. ఆమె కదలలేదు...

నిశ్శబ్దంగా... నిర్లిప్తంగా నిలుచుంది.

''వెళ్ళవే దున్న... వెళ్ళు!'' మళ్ళీ హుంకరింపు ఆమె శిలలా...

ఆమె ఆకాశంలా...

ఆమె పుడమిలా...

నిశ్శబ్దంలో అలానే చూస్తుంది... ఆమెలో ఆలోచనలు...

డాక్టర్‌ను తేకపోతే ఏమవుతుంది? అతను చచ్చి పోతాడు... తన పసుపు కుంకమలు పట్టుకు పోతాడు... తననుదుటన విధవనే బ్రేడ్ మార్క్ వేసి... దిక్కులేనిదన్న బిరుదిచ్చి... చచ్చిపోతాడు. దానివల్ల తన కొచ్చే నష్టమేమీ లేదు. ఇంకా లాభముంది. ఈ హింసనుంచి.... ఈ చెరనుంచి విముక్తి లభిస్తుంది.

డాక్టర్‌ను పిల్చుకొస్తే... తను బ్రతుకు తాడు... అతను బ్రతికితే తను చస్తుంది... తనలామరో అబల...ఆ తరువాత మరొకరు...

డాక్టర్‌ను పిలవాలా? వద్దా?.... సందిగ్ధం... జీవన్మరణాల సందిగ్దం

అతను ఆమె భర్త

అగ్ని సాక్షిగా ఆయిన భర్త... ఆ క్షణమామెకి విషయం గుర్తు రావటంలేదు. పెళ్ళినాటి ప్రమాణాలేమీ గుర్తురావటల్లేదు. ఒక్కటే గుర్తు వస్తోంది... అతని డైరీలోని అక్షరాలు... 'దీన్ని ఎట్లానయినా వదిలించుకోవాలి'... చుట్టూ ఉన్న గోడలు, గాలి ఆ మాటను గొంతెత్తి అరచి చెప్తున్నట్లనిపిస్తుంది.

ఇప్పుడు వాళ్ళిద్దరి మధ్య భార్యాభర్తల అను బంధంలేదు.

చావు బ్రతుకుల పోరాటం

ఈసారి అతను భయంగా, జాలిగా ప్రాధేయ పడుతున్నట్లు చూస్తున్నాడామెను. అతని అణుఅణువున భయం... చావు భయం... అతని జాలి కళ్ళల్లో ఆమెకు తను పడ్డ చిత్రహింసలు కన్పిస్తున్నాయి... తను భరించిన భయంకర రాత్రులు కన్పిస్తున్నాయి. తన మృత్యువు నీడలు కన్పిస్తున్నాయి.

అతను బ్రతికితే తనకు చావు తప్పదు.

తను బ్రతకాలంటే అతను చావక తప్పదు

ఇది స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్...

ఆమెలోని మానవత్వాన్ని పూర్తిగా చంపేసింది. గిలగిలా కొట్టుకుంటున్నతను ఆమెకు భర్తలా కనపడటల్లేదు...

*